కథ

# తలకు మించిన బరువా?

సత్యవాడ సోదరీమణులు

‘‘శ్రీవారూ! ఏమీ అనుకోకుండా నా మాట వినండి’’ వినీల అందో లేదో...

‘‘అబ్బబ్బా! మొదలు పెట్టావా నీ సోది’’... విసుక్కున్నాడు వరుణ్.

‘‘ఈ ఒక్క విషయంలోను చిరాకు పడకండి. మీ మంచి కోసమేగా పదేపదే చెప్పేది. మీరు ఆఫీసుకు వెళ్లిందగ్గర్నుంచి తిరిగి వచ్చేదాక నా మనసు భయంతో రెపరెపలాడుతూనే ఉంటుంది’’

‘‘నువ్వు చాలా ధైర్యంగా ఉండొచ్చోయ్! హఠాత్తుగా నాకేమైనా జరిగినా నువ్వు లక్షాధికారిణివై పోవచ్చు. నా పేరున ఇన్స్యూరెన్స్ పాలసీలున్నాయి. మా ఆఫీసువాళ్ళు బాగానే ముట్టచెప్పుతారులే! నీ కొచ్చే లోటేముండదు’’

‘‘ఏమిటా ముక్కు చీదటం! చెప్తున్నాగా! ఇప్పటి కన్నా దర్జాగా బ్రతికేస్తావ్ ప్రియా’’ భార్య భుజం తడుతూ అన్నాడు వరుణ్.



‘‘మాట వినకపోతే మానేరు కానీ అశుభం పలకొద్దు స్వామీ’’ ఏడుస్తూనే అంది వినీ.

‘‘మరైతే మళ్ళీ నాకు హితబోధలు చెయ్యకు’’ అనేసి అద్దం ముందు నిలబడి గిరజాల జుట్టును మరింత అందంగా దువ్వకొని తనలో తానే మురిసి పోయాడు.

తన కేశ సౌందర్యాన్ని చెడగొట్టుకోమనా! బోడిసలహా... అందమైన క్రాఫ్ చూసే కదా తనని వలచి వరించింది! తన ఉంగరాల జుట్టు మునివేళ్ళతో సవరిస్తూ ‘మనది ప్రేమ పెళ్ళని కట్నం ఎగ్గొడతావనుకొనేరు. మీ లాంటి అందగాడు నా సొంతం అవుతున్నప్పుడు డబ్బో లెఖ్ఖ. నాన్నతో వాదులాడైన లక్షలు తేనూ... అంటూ గారాలుపోయి రెండు లక్షల కట్నం కుమ్మరించి మరీ తనిల్లాలైంది. ఇదంతా తనక్రాఫ్ మహిమేగా... మరో సారి అపురూపంగాఅద్దంలో తన క్రాఫ్ చూసుకొని ఆఫీసుకి బయల్దేరాడు. నిట్టూర్చింది.. వినీల ఈయనగారి ధోరణి ఇక మారదు. చచ్చి ఊరుకున్నా ఫరవాలేదంటాడు, కానీ...తలకి మించిన బరువు తను మోయలేడట. ప్రతి రోజూ తనిలా వాదించి ఓడిపోతూనే ఉంది. ఇవాళే నే ఛస్తే నువ్వు సుఖపడతావ్ అన్నారు! ఏమన్నారు నిన్న నేను హెల్మెట్ పెట్టుకోవటం కుదరని పని... నీకు ప్రాణాలంటే అంత ప్రీతి ఉంటే మీ నాన్నకో ఫోన్ కొట్టు, తలకు మించిన బరువు మా వారు

మోయలేరు మీరు అప్పుల బరువు మోస్తే మోసారుగాక, ఓ బుల్లి కారు బహుమతిగా ఇచ్చే యమని అని తన నోటికి తాళం వేయలేదూ!

ఈ మోస్తరు తలపులతో వినీల సతమతమవు తూనే ఉంది. 'తాము అపర మన్మథులం అనుకొని ఉప్పొంగిపోయే పురుష పుంగవులు చాలామందే ఉన్నారు. వరుణ్ పని చేస్తున్న ఆఫీసులో సమయం దొరికినప్పుడల్లా ఒకరి నొకరు తెగ పొగిడేసుకుంటూ, ఒకరి పొగడ్తలకి ఇంకొకరు ఉబ్బి తబ్బిబ్బై పోతుంటారు.

మగాళ్ళలో నువ్వు భలే అందగడివోయ్! పున్నమి చంద్రునిలాంటి చక్కని మొహం దానికి వన్నెతెచ్చే ఆ గిరజాల జుట్టు ఆహా! మగసిరి అంటే నీదే అని అందరి చేత అన్పించుకోవటం వరుణ్‌కి ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అందుకే అతనికి ససేమిరా హెల్మెట్ ధరించటం ఇష్టం ఉండదు. ఇన్ని మెచ్చు కోళ్ళు పొందే క్రాఫ్ చెదిరిపోతుంది.

బట్టతల భూషణరావు, వెంట్రుకలు నెరిసిన వీరాస్వామి ఇలాంటి ప్రబుద్ధులు కొందరు వోర్వ లేని తనంతో తనను వేధిస్తూనే ఉన్నారు.

తను ఎవరినీ లెక్క చేయడు. ఇంతోటి ఏం జరు గుతుందేం అన్న ధీమా! ఆఫీసులో అడుగు పెట్టే సరికే... వచ్చాడోయ్ మన హీరో ఈ సొగసరి మొగ రాయుడు సినిమాల్లో నటించటం కోసం ప్రయ త్నించినా ఏమంత కష్టం కాదు. మరేం! మరేం ఎంత పేరున్న నటి అయినా మన వాడితో యాక్టింగ్ చేయడానికి ఉబలాట పడిపోదూ... కొలిగ్స్ నోటి వెంటవస్తున్న మాటలు వరుణ్‌ని ముందుకి సాగని వ్వలేదు. నిజమే ఈ ఆలోచన ఎందుకు రాలేదు తనకి. ఒకరిద్దరు సినిమా డైరెక్టర్లు కూడా ఇంతో అంతో తెలుసు సాయంత్రమే వాళ్ళని కలవాలి. అందని పండు కోసం అర్రులు చాస్తున్నట్టు అశగా తనలో అనుకుని చుట్టూ ఉన్న మిత్ర బృందాన్ని ఆత్మీయంగా పలక రించాడు. కాస్త టీ తాగి వద్దాం పదండి... అంటూ క్యాంటీన్‌కు దారి తీసాడు. ఎవరేది కోరితే ఆ ఫలహా రాలు కూడా పెట్టించి మరీ పొట్టలు నింపాడు. వాళ్ళంతా వరుణ్‌ని ఆకాశానికి ఎత్తేయటంలో ఆంతర్యం అదే అన్నట్టు తృప్తిగా త్రేన్చారు.

★★★

ఆయాసంతో రొప్పుతూ ఇంటికొచ్చిన ప్రియ మిత్రుని చూస్తూనే "ఏం అయ్యిందిరా ఏమిటా కంగారు, ముఖమంతా చెమటలు పట్టేసి ఈ అవ తారం ఏమిట్రా!" అన్నాడు వరుణ్. "పోలీసులు తరుముకొస్తున్న నేరస్థునిలా పరుగులు పెడుతూ దూసుకొచ్చారు అన్నయ్యగారూ....ముందు ఈ మంచి నీళ్ళు తాగండి" నీళ్ళ గ్లాసు అతనికందిం చింది వినీల. "పోలీస్ పోలీస్! వాళ్ళ మాటెత్తకు చెల్లెమ్మా" అంటూ రెండు గుటకల్లో నీళ్ళు తాగేసి సోఫాలో కూలబడ్డాడు చంద్రం. "ఇప్పటికి ప్రాణం స్థిమిత పడిందిరా వరుణ్! నిజంగానే దొంగనో కూనీకోరునో తరిమినట్టు నన్ను వెంబడించారురా బీట్ కానిస్టేబుల్. వాడికి చిక్కకుండా తప్పించుకోవటానికి తల ప్రాణం తోకకొచ్చిందనుకో... ఇంతోటి హెల్మెట్ తగిలించుకో లేదని వాడి జులూం! పట్టుబడి పోయానా ఫైన్ వేసేస్తాడు". హెల్మెట్ ప్రస్తావన రాగానే వంటింట్లో టీ పెడుతున్న వినీల స్టౌ ఆపేసి హాల్‌లోకి వచ్చే సింది. "తప్పుచేయమన్నదెవరు? తప్పించుకు తిర గమన్నదెవరు? హాయిగా హెల్మెట్ పెట్టేసుకొని డ్రైవ్ చేస్తే పోయేదేముంది" అంటూ భర్తని చిలి పిగా చూసింది. "చాల్లే చెప్పొచ్చావ్! మా మాటల మధ్య నిన్ను కల్పించుకోమన్నామా ముందు మా మొహాన టీ పొయ్యి" అన్నాడు చిరాగ్గా.

"ఒక్క టీయేనా, టిఫిన్ కూడా చేసి పెడతా కానీ చెవుల్లో ఇల్లు కట్టుకొని రేడియోలు, తెల్లారితే కళ్ళముందు వాలి న్యూస్ పేపర్లు తెగపోరుపెడు తున్నా మీ బోటి వాళ్ళకి తలకెక్కకుండా ఉందన్న య్యగారూ! సమస్యలు ఎందుకు కొనితెచ్చు కుంటారు ఎంచక్కా నేనుచెప్పినట్టు..."

"చెల్లెమ్మా ఇక ఆపేయ్ మనవాడు ఉగ్రుడైపో తున్నాడు..."

"అది ఆయనికి మామూలే లెండి! నేనెందు కంటున్నానో కాస్త ఆలోచించండి మీరు కూడా..."

"ఆ... పోల్లేదు చెల్లెమ్మా.... ఈ చిన్న విషయానికి మా వరుణ్ గాడితో పేచీకి దిగుతావేంటీ! ప్రతీదాన్నీ భూతద్దంలో చూపించి భయపెట్టడం వాళ్ళకి పరి పాటే. చూసినవి చూసినట్టు, విన్నవి విన్నట్టు వది లేసి హాయిగా తిరిగేస్తే ఏ ప్రమాదాలు ముంచుకు రావంటాను నేను. నీ మాట వినకూడదని కాదు".

"ఆ బోడి హెల్మెట్ పెట్టుకుంటే సెల్‌ఫోన్ వినిపించదు. మార్కెట్‌లో హెల్మెట్‌లు చెల్లుబాటు కావడం కోసం ఏదో అలా గోలపెడతారు కానీ మనతో పాటు వెనకా ముందూ వచ్చే వాహనాల హారన్లు మాత్రం సరిగ్గా మన చెవిదాకా వస్తాయా! తన తెలివి తేటలన్నీ ఉపయోగించి వినీలకి నచ్చ చెప్పబోయాడు. ఇవన్నీ కుంటిసాకులు మనదృష్టి రోడ్డుపైనుండాలే కానీ హెల్మెట్‌తో ప్రయాణం ఎంతైనా మంచిది. ఆ కాసేపు సెల్‌ఫోన్‌లో మాట్లాడి తీరాల. ప్రయాణం పూర్తికాగానే మిస్ కాల్స్ ఏవో చూసుకోవచ్చుగా".

"ఈ టాపిక్ వదిలేస్తారా లేదా!" వరుణ్ అస హనంగా అన్నాడు. "వదలక ఏం చేస్తాను. 'మొండి వాడు రాజుకంటే బలవంతుడన్న' సామెత ఊరికే పుట్టిందా" విసురుగా వంటింట్లోకెళ్ళింది వినీల.


★★★

"అరే చంద్రం మా వినీ, పకోడీలు వేసేస్తున్న ట్టుందోయ్! చెప్పొద్దు భలే! టేస్టీగా చేస్తుందిరా! అవును లేవోయ్ మా చెల్లాయి చేతి ఉల్లి పకోడి నేనె న్నిసార్లు తినలేదు! కమ్మటి వాసనకే నోరూరిపో తోంది" ముక్కుపుటాలెగరేస్తూ ఆనందపడిపో యాడు చంద్రం.

"వెనకటికో మహాకవి పద్యానికో పకోడి పెడ తానంటే గొంతు సవరించుకోకుండానే ఆసువుగా లెక్కలేనన్ని పద్యాలు చదివేశాడంట. కొంపతీసి నువ్వుగానీ, అలాంటి ప్రయత్నం చేశావంటే మా దంపతులకింకేం మిగులుతాయి" నవ్వుతూ అన్నాడు వరుణ్.

"కవిత్వం అయితే చెప్పలేను గానీ నేను వచ్చింది మాత్రం నీతో ఓ మంచి ముచ్చట చెపుదా మనే సుమా! మొత్తం మీద మన గురుడు పట్టుబట్టి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని మనకే బాస్‌గా వచ్చేస్తు న్నాడు."

"ఏది ఆ వెధవ మన శేఖరంగాడే" ఆశ్చర్యంతో కనుబొమ్మలెగరేస్తూ అన్నాడు. "అక్షరాల వాడేరా వరుణ్ మనకిక ఆఫీసులో ఇరకాటం ఉండదు. సంవత్సరంగా బాకీపడ్డ పనులన్నీ అటూ ఇటుగా ఆఫీసు ఎగ్గొట్టి చక్కపెట్టేసుకోవటమే. ప్రాణ మిత్రుడే బాస్ అయితే మన ప్రాణాలెంత తెరిపిన పడతాయిరా!" స్నేహితులిద్దరు పసిపిల్లల్లా ఎగిరి గంతులేశారు. ఆ మిత్ర బృందానికి శేఖరంపై అపా రమైన నమ్మకం. తమతో పాటు క్లర్కుగా పనిచేసిన అతగాడు ప్రమోషన్ కొట్టేసి ప్రవాసాంధ్రుడైపో యాడు. వీడ్కోలు పార్టీ ఇస్తూ కన్నీళ్ళు పర్యంతమ యిన ఆప్తమిత్రులందరికీ అభయమిస్తూ "మన వియోగం ఎంతకాలం ఓ ఏడాది తిరిగేలోగా మీ బాసుని నేనే అవుతాను. ఇతగాడి మోస్తరుగా దర్పం చూపిస్తావా! వీరంతా నా ప్రియమిత్రులు. మీ సాదక బాధకాలు అర్థం చేసుకుంటాను. అప్పు డిక ఈ సతాయింపులు, వేపుకు తినటాలు మీ కెదు రు కావు" అని అందరితో కరచాలనం చేశాడు. నిజంగానే పట్టు సాధించాడు.



''ఎంత మంచి వార్త మోసుకొచ్చావు. ఈ క్షణం నీకు స్వీట్ తినిపించాలిరా వినీ ఆ చేత్తోనే స్వీటు కూడా తయారుచేయ్'' గావుకేక పెట్టాడు.

''ఉ...ష్ నోరు ముయ్యరా పెళ్ళామే కదా అని పురమాయింపులుమొదలుపెడితే పెనం తిరగేసిందట ఓ ఇల్లాలు. ఆ స్వీటేదో మన శేఖరం గాడితోనే కలిసి లాగిందాం కానీ మనం చెయ్యవలసిన పనులు చాలానే ఉన్నాయి. శేఖరంగాడు సెటిలయ్యేదాకా మనకెవరికీ ఊపిరి సలపనిచ్చేలా లేడు. నీటైన లోకాలిటీలో ఓ ఇల్లు కొనేస్తాడట. అలానే కారు కూడా ఏది తీసుకుంటే బావుంటుంది అని మనల్నే అడుగుతున్నాడు. పిల్లలిద్దరూ హైస్కూలు చదువుకొచ్చేశారు స్కూల్లో జాయిన్ చేస్తే చదువుతో పాటు క్రమశిక్షణ, కళలు,క్రీడలు నేర్పే అవకాశం ఉంటుంది ఇవన్నీ మనమే చూసుకోవాలట ఇలా చాలానే ఏకరువు పెట్టాడ్రా ఫోన్‌లో''.

''అన్నింటికీ ఊకొట్టా మరి కాబోయే, రాబోయే మన బాస్‌కదా''.

''అలా వెక్కిరిస్తావేంరా చంద్రం! వాడు చెప్పినవన్నీ తు.చ. తప్పకుండా చేసేద్దాంరా. శేఖరం ఎంత సుఖంగా సంతోషంగా ఊళ్ళో సెటిలయితే మనకంత ఆనందం''.

''మరే మరే అతగాడక్కడ కూర్చుని ఆర్డర్లు జారీ చేస్తుంటే మనం ఇల్లు పట్టకుండా తిరిగి వళ్ళు హూనం చేసుకోవాలి. పెట్రోలు గిట్రోలు ఎవడి స్తాట్ట. మనటైం మాత్రం ఎంత అమూల్యమైంది? మన టైం మాత్రం ఎంత అమూల్యమైంది?''

''అదిగో మళ్ళీ ఏవిట్రా చంద్రం? వాడికోసం మనం ఈ మాత్రం కష్టపడలేమా నువ్వేమను నాకు మహా సంబరంగా ఉంది. వాడు మంచి సొంత ఇంట్లో ఉంటూ, పిల్లల్ని చక్కగా చదివించుకుంటూ దర్జాగా కారులో తిరగాలి, వాడి కలలన్నీ, పండాలి, వాడి కోరికలన్నీ తీరాలి''.

''తీర్చేద్దాంగానీ పకోడీలతో పాటు టీ కూడా చల్లారిపోతోంది. నీ కోసం నేనూ కూర్చున్నాను. మొదలుపెట్టరా నాయినా'' వరుణ్ నోరు తెరచి ఏదో అనబోయింతలో ఓ రెండు పకోడీలు నోట్లో పెట్టేసి అన్నాడు చంద్రం.

★ ★ ★

శేఖరానికి ఎంతో తృప్తిగా ఉంది. తను ఎంత ఖర్చు పెట్టాలి అనుకున్నాడో అంతలోనే అన్ని వసతులతో అందమైన ఇల్లు కుదర్చిన తన మిత్రులకి థాంక్స్ చెప్పుకోవాలి. ఒక ఇల్లనేమిటి? తనేం చెప్పినా చకచకా చేసుకుపోయారు. తనకే ఇబ్బంది కలగనీయలేదు. దేనికీ వెతుకులాడవలసి రాలేదు తను. పుత్ర రత్నాలిద్దరినీ అన్ని హంగులూ ఉన్న స్కూల్లో వరుణ్ పూనుకొని జాయిన్ చేసేశాడు. వేరే రాష్ట్రంలో ఏడాదిపాటు ఉండి హఠాత్తుగా ఉన్న ఊళ్లో స్థిరపడటం మాటలా. ఇదంతా మిత్రుల చలవే. బలవంతంగా వాళ్ళని షాపింగ్‌కి తీస్కెళ్ళి వాళ్ళకి నచ్చిన పాంట్లు, షర్టులు తీసుకున్నాడు. వరుణ్‌కి, చంద్రానికి ప్రత్యేకంగా సెల్ ఫోన్లు గిఫ్టగా ఇచ్చాడు.

''శేఖర్ నువ్ మరీ మొహమాట పెట్టేస్తున్నావ్ రా!''

''దాందేముందిరా వరుణ్ మనం ఒకరికొకరం మీ స్నేహంలో జీవితమంతా తీయగా గడిపేయాలని ఉందిరా'' అంటూ వరుణ్‌ని కౌగిలించుకున్నాడు.

''సరే...సరే...గడిపేద్దాం రేపింకా కారు పార్టీ ఉందిగా అప్పుడు నేను మరో గిఫ్ట్ అడిగేస్తా ఇస్తావా?''

''నిజం చంద్రం మన ఫ్రెండ్‌షిప్ కోసం ప్రాణాలైనా ఇచ్చేయాలనిపిస్తోంది నాకు. అడిగేయ్ నీ కిష్టమైన గిఫ్ట్'' చంద్రంకళ్ళలోకి ప్రేమగా చూశాడు.

''మరిచిపోయాను అవును రేపేగా షోరూంకెళ్ళి కారు తెచ్చేసుకోవాలి'' అన్నాడు వరుణ్.

ఇలా ముచ్చట్లాడుకుంటున్న వాళ్ళకి ఇల్లు గుర్తుకురాలేదు. సెకెండ్ షో సినిమాకి వెళ్ళి అర్థ రాత్రి దాటుతుంటే ఒకరినొకరు విడిచిపెట్టలేనట్టు బాధపడిపోతూ ఎవరిళ్ళకు వాళ్లు బయలుదేరాడు.

వినీలకి విడ్డూరంగా తోచింది. మరుక్షణం అదంతా పగటికలగానే మిగిలిపోయింది. వరుణ్ కలతనిద్రలో, కలవరింతలలో కోరుకున్న క్షేమం శేఖరానికి దక్కలేదు. నూరేళ్ళు నిండకుండానే శేఖర్ దేహం చల్లబడిపోయింది. వరుణ్‌కి శేఖరం ప్రజంట్ చేసిన సెల్‌ఫోన్‌కి వచ్చిన మొదటి కాల్ చేసింది చంద్రం.

కళ్ళు నులుముకుంటూ తలుపులు తెరిచారు ఆ ఇల్లాళ్ళు వారంతా తమతమ భర్తలతో ఓ మాటే అన్నారు. ''మీ శేఖరం నాకో సవితిలా తయారయినట్టున్నాడు. అతను ఊళ్లోకొస్తాడన్నది మొదలు మీ కాలు ఇంట్లో నిలవడం లేదు ఇంట బయటా చాకిరితో నేను సతమతమవుతుంటే పట్టదే మీకు''.

ఆ భర్తల మొహల్లో చిరునవ్వులే సమాధానాలు వరుణ్, చంద్రాలయితే సెల్‌ఫోన్లు భార్యల చేతుల్లో పెట్టి ఒకటే ముచ్చట్లు శేఖరం మంచితనాన్ని గురించి, ఆ స్నేహ హృదయాన్ని గురించి నిండు నూరేళ్ళు ''మా శేఖరం చల్లగా ఉండాలి వినీలా. ఇలానే వాడెప్పటికీ సుఖసంతోషాలతో ఉండాలి. ఇంతమంచి స్నేహితుడు దొరకడం మా పూర్వజన్మ పుణ్యం'' అంటూ నిద్రలో కూడా శేఖర్ క్షేమాన్నే కోరుతూ కలవరించసాగాడు వరుణ్.

వినీలకి విడ్డూరంగా తోచింది. మరుక్షణం అదంతా పగటికలగానే మిగిలిపోయింది. వరుణ్ కలతనిద్రలో, కలవరింతలలో కోరుకున్న క్షేమం శేఖరానికి దక్కలేదు. నూరేళ్ళు నిండకుండానే శేఖర్ దేహం చల్లబడిపోయింది. వరుణ్‌కి శేఖరం ప్రజంట్ చేసిన సెల్‌ఫోన్‌కి వచ్చిన మొదటి కాల్ చేసింది చంద్రం.

వరుణ్ హలో అనే లోగానే భోరున ఏడ్చేశాడు. ''మన శేఖర్ మనకిక లేడురా'' అంటూ.... సెల్‌ఫోన్ జారిపడిపోయింది. నిన్నటి రోజు ఆనందాన్ని పంచుకున్న మిత్రబృందమంతా పట్టరాని దుఃఖంతో హాస్పిటల్ ముందు గుమిగూడారు.

''అయ్యయ్యో ఇంత ప్రమాదమెలా జరిగింది. యాక్సిడెంట్ అయితే మాత్రం తలపగిలి ప్రాణమే పోవటం ఎలా సంభవం....''జనాల నోళ్ల లోంచియేవో మాటలు ''పాపం ఈ ఒక్క పూటే సరూ మోపెడ్ ప్రయాణం, సాయంత్రం నుంచి మనం కారులోనే తిరగేది. షోరూం నుండి కారు తీసుకొచ్చేస్తా నువ్వు పూజసామాను సిద్ధం చేయి అని హుషారుగా మోపెడ్ స్టార్ట్ చేశాడట. ఇల్లు దాటి ఓ రెండు మలుపులు తిరిగాడో లేదో అంతలోనే యాక్సిడెంట్. మా పిల్లల్ని స్కూలుకి దిగబెట్టి వస్తూ చూశాను. నా గుండె చెరువైపోయింది. ఒక్క అంగలో ఇంటికొచ్చి విషయం సరోజకిచెప్పి లాక్కెళ్లాను. హాస్పిటల్‌కి తీస్కెళుతుండగానే భార్య ఒడిలోనే ప్రాణాలు విడిచాడు''. శేఖరం వాళ్ళ పక్కింట్లో ఉండే నీరజ వివరిస్తోందందరికి.

శేఖర్ శవాన్ని బంధువులకి అప్పగిస్తూ ''ఇలాంటి కేసులు తరచూ వస్తున్నాయ్. ఇదంతా చేతులారా చేసుకుంటున్నవే అనుకోక తప్పదు తలకి హెల్మెట్ ఉంటే ఇంత తొందరగా ప్రాణాపాయం కలగకపోవచ్చు. కనీసం మేం చేయగలిగింది చేసే అవకాశమైనా ఉంటుంది. మేమేం ప్రాణదాతలం కాకపోయినా మనిషిని బ్రతికించే ప్రయత్నం చేయటం మా కర్తవ్యం కదా'' అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

శేఖరం బంధువుల రోగనలతో డాక్టర్ మాటలు అస్పష్టంగానే వినిపించి... చంద్రం, వరుణ్‌లు చలించిపోయారు. ప్రి... మిత్రుని మరణంతో అంతా షాక్ తిన్నారు. వ... ఓ వారం పాటు ఇల్లే కదలలేకపోయాడు, ప్రమా... పిపోయాడు.

''మీరిలా ఎన్నాళ్ళు ... గాలుపడి కూర్చుంటే మాత్రం పోయిన మీ స్నే...తుడు వస్తాడా! ఈరోజైనా ఆఫీసుకెళ్ళండి మొన...టి నుంచి మీ బాస్ తెగ ఫోన్‌లు చేస్తున్నాడుగా'' కాఫీ అందస్తూ అంది వినీల.

''అవును వినీలా వెళ్ళాలి'' భార్య చేతిలోంచి కాఫీ అందుకొని రెండు గుటకల్లో తాగేసాడు. గభాలున స్నానం చేసేసి మూలపడేసిన హెల్మెట్ ధరించి ఆఫీసుకి బయలుదేరాడు. రెప్ప ఆర్పటం మర్చిపోయి భర్తనే చూస్తోంది వినీల.

''అలా చూస్తావేం వినీ ఇప్పటికి నీ మాట శిరసావహించాను కదూ! నువ్వప్పుడే చెప్పావ్ ఇది తలకి మించిన బరువుకాదని'' అనేసి వెళ్ళిపోయాడు.

వినీల పెదాలపై విచిత్రమైన నవ్వు విరిసింది.

★